క్లుప్తంగా

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



తలపడుతున్న క్రీడాకారులు

సరుబుజ్జిలి: పైడి ఆటోమోటివ్ ఆధ్వర్యంలో పురుషోత్తపురం గ్రామంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆటోమోటివ్ అధినేత పైడి రమేష్‌నాయుడు పోటీలను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 40 టీములు పోటీల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు రామ్మోహన్‌రావు, సాయిమణికంఠ, శ్రీను, శివాజీ, అప్పలనాయుడు వెల్లడించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో విజిలెన్స్ తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

పొందూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో విజిలెన్స్ అండ్ డ్రగ్ కంట్రోల్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు పరిశీలనలో భాగంగా ప్రాంతీయ నిఘా అమలు అధికారి ఎ.సురేష్‌బాబు ఆదేశాల మేరకు పొందూరు ఆస్పత్రిలో తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ పథకాల అమలు, రోగులకు అందిస్తున్న సేవలు, సౌకర్యాలు, సిబ్బంది రికార్డులు, మందుల నిల్వలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. ఆస్పత్రి పనితీరుపై నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ అశోక్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి పాల్గొన్నారు.

సందడిగా వీరగున్నమ్మ సినిమా రిలీజ్ కార్యక్రమం



కేక్‌కట్ చేస్తున్న మోహన్‌రావు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోని శ్రీదేవి మహల్ ఆవరణలో 'వీరగున్నమ్మ' సినిమా విడుదల కార్యక్రమం రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జె.జె.మోహన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి సందడి చేశారు. అక్కడకు వచ్చిన వారికి సినిమా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సిటిజన్ ఫోరం గౌరవ సభ్యులు బి.మోహన్‌రావు, బి.జనార్దరావు, థియేటర్ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

172 మందికి వైద్య సేవలు

పాతపట్నం: పాతపట్నంలోని సచివాలయం–2లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ 172 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

పిల్లలకు వైద్య పరీక్షలు

హిరమండలం: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ సాయిగీత తెలిపారు. పాత హిరమండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు శుక్రవారం వైద్య తనిఖీలు నిర్వహించారు.

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం

హిరమండలం: పోషకాహారం తీసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని జిల్లా సామాజిక సామాన్య కార్యకర్త మోహన్‌రావు అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం సమావేశ మందిరంలో మండల మహిళా సమైఖ్య సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం వి.శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

మేకల పైనుంచి దూసుకెళ్లిన లారీ

మెళియాపుట్టి: మేకల పైనుంచి లారీ దూసుకొని వెళ్లింది. ఈ సంఘటన దీనబంధుపురం వద్ద శుక్రవారం చోటుచేసుకోగా.. ఒక మేక మృతి చెందగా.. నాలుగు తీవ్రంగా గాయపడ్డాయి. దీంతో బాధితుడైన మర్రిపాడు–సీ గ్రామ పంచాయతీ జలకలింగుపురం గ్రామానికి చెందిన దుక్క పాపారావు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరారు.

బాలకృష్ణమ్మకు ఘన నివాళి

పోలాకి: ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు మార్పు బాలకృష్ణమ్మ బాటలోనే ఉపాధ్యాయులు నడవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతాడ దిలీప్‌కుమార్ అన్నారు. బాలకృష్ణమ్మ 10వ వర్ధంతి సందర్భంగా పోలాకి ఎంఆర్‌సీలో ఆయన చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాలకృష్ణమ్మ 1987లో ఏపీటీఎఫ్‌ను పునర్ వ్యవస్థీకరించి అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించారని గుర్తు చేశారు. ఎంఈవో శ్రీనివాసనాయక్, పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సుస్థిర పాలన



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- బూర్జలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బూర్జ: రాష్ట్రాన్ని సుస్థిరంగా, సుభిక్షంగా ఉంచే శక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జ మండల కేంద్రంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్న ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత ప్రభుత్వ హయాంతలో ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేసిన సందర్భాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. పథకాల అమలుపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు అందిన ప్రభుత్వ లబ్ధిని సచివాలయ సిబ్బందితో కలిసి వివరించారు. పెంచిన పింఛన్‌పై ఆరా తీశారు. ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే గ్రామ సచివాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యుత్ స్తంభాలు, కాలువలు ఏర్పాటు చేయాలని, మంచినీటిని అందించాలని, అంగన్‌వాడీ మూడో కేంద్రానికి మరుగుదొడ్డి, ప్రహరీ నిర్మించాలని స్థానికులు స్పీకర్‌ను కోరారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, మండల కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర అవుట్‌సోర్సింగ్ డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, స్థానిక సర్పంచ్ ఎ.అనురాధ, వైస్ ఎంపీపీలు కరణం కృష్ణమూర్తినాయుడు, బుడుమూరు సూర్యారావు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణ మూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గుమ్మడి రాంబాబు, వైస్ సర్పంచ్ తొత్తడి కృష్ణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల అదుపులో మహిళా పోలీసుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎస్సై గోవింద

కొత్తూరు: గ్రామాల్లో నేరాలను అదుపు చేయడంలో సచివాలయ మహిళా పోలీసుల పాత్ర కీలకమని స్థానిక ఎస్సై మురపాక గోవింద అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని మహిళా పోలీసులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే కేసులు రాజీ అయ్యేలా సంబంధిత వ్యక్తులతో మాట్లాడాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అవ్వడం వలన కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు. ప్రధానంగా భూవివాదాలు, భార్యభర్తల తగాదాలు, రోడ్డు ప్రమాదాల కేసులపై దృష్టి పెట్టాలన్నారు. లోక్‌అదాలత్ అయిన తరువాత కేసులను రాజీ చేసే ప్రయత్నాలు చేయకూడదన్నారు. గ్రామాల్లో అక్రమ మద్యం, నాటుసారా రవాణపై నిఘా పెట్టాలన్నారు. సంక్రాంతి సమీపిస్తున్నందున పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. పండుగ నేపథ్యంలో శాంతిభద్రతలపై దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

హిరమండలం: రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని ఆ విభాగం కార్యకర్త ఎంఏ రమణమ్మ అన్నారు. మహాలక్ష్మీపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో మొక్కల పెరుగుదలకు కావాల్సిన పోషకాలు అందించేందుకు ఎకరానికి 15 నుంచి 20 రోజులకు ఒకసారి పంటకాలంలో ద్రవజీవామృతం నేలపై నీటితో పాటు విడిచి పెట్టాలన్నారు. ఇలా చేస్తే ఎటువంటి రసాయనిక ఎరువులు అవసరం లేకుండా పండించవచ్చునన్నారు. నేలలో నిద్రావస్థలో ఉన్న సూక్ష్మజీవులను మేల్కొలిపి భూమిలోపల ఉన్న పోషకాలను మెక్కలకు అందిస్తాయన్నారు. అలాగే ద్రవజీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీకాంత్ ఉన్నారు.

పాఠశాలలో సంక్రాంతి వేడుకలు



గాలిపటాలు ఎగురవేస్తున్న విద్యార్థులు

పాతపట్నం: పాతపట్నంలోని సెయింట్‌ఆన్స్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ క్రిష్టిజాన్ ఆధ్వర్యంలో పండుగ ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. గాలిపటాలను విద్యార్థులతో ఎగురవేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న సర్పంచ్ రేగిడి లక్ష్మి

పొందూరు: పొందూరు పంచాయతీలోని అన్ని సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తామని సర్పంచ్ రేగిడి లక్ష్మి అన్నారు. స్థానిక నెహ్రూపార్కు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. కనకలవీధిలో రోడ్డు నిర్మాణం చేయాలని, అదే వీధిలో పందుల బెడదను నివారించాలని, శివాలయం చెరువుకు రక్షణ కవచాలు కావాలని, నెహ్రూపార్కులో వృద్ధులకు రిక్రియేషన్‌కు అనుకూలంగా మార్చాలని, పలుచోట్ల కాలువలు నిర్మించాలని, భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలని ప్రజలు అడిగారు. దీనికి స్పందిస్తూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో ఉపసర్పంచ్ అనకాపల్లి గోవింద, ఈవో రమేష్ పాల్గొన్నారు.

పింఛన్లతో ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే రెడ్డిశాంతి



మెళియాపుట్టి: పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: పింఛన్ల పెంపుతో లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కలిగిందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కొత్త పింఛన్లను లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతీ అవ్వాతాతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దకొడుకు అయ్యారన్నారు. పింఛన్ మొత్తాన్ని పెంచి వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు నేనున్నానని భరోసా ఇచ్చారన్నారు. మెళియాపుట్టి మండలంలో 306 కొత్త పింఛన్లు ముంజూరైనట్టు పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న పాలన ఉందన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, వైస్ ఎంపీపీ ఆదినాయుడు, ఎంపీడీవో చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని, ఏపీఎం లలిత, నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, పల్లి యోగి, జయమునిరావు, వాసు, భానోజీరావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



సారవకోట: పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



కొత్తూరు: పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ కళావతి

గొట్టిపల్లిలో..

కొత్తూరు: గొట్టిపల్లి గిరిజన గ్రామంలో సర్పంచ్ నిమ్మక కళావతి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ. 2,500 నుంచి 2,750 రూపాయలకు పెంచారన్నారు. కార్యక్రమములో వైఎస్సార్‌సీపీ నాయకుడు నిమ్మక రామకృష్ణ పాల్గొన్నారు.

బెజ్జి గ్రామంలో..

సారవకోట: కొత్తగా మంజూరైన వృద్ధాప్య పింఛన్లను నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ బెజ్జి గ్రామంలోని లబ్ధిదారులకు అందజేశారు. మండలానికి కొత్తగా 199 పింఛన్లు మంజూరైనట్టు చెప్పారు. జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, నాయకుడు గెల్లంకి వెంకటరావు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో జెడ్పీ సీఈవో



వెంకట్రామన్ కుటుంబ సభ్యులకు ఆలయ చరిత్ర వివరిస్తున్న అర్చకుడు

జలుమూరు: శ్రీముఖలింగంలోని మధుకేశ్వరుడుని జిల్లా పరిషత్ సీఈవో రావాడ వెంకట్రామన్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, స్వామివారి ఏకవార అభిషేకాలు, అర్చనలతోపాటు వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అర్చకులు ఆలయ చరిత్ర, స్వామివారి కథను వివరించి శేష వస్త్రాలు అందించారు.

రాజీ పడదగ్గ కేసులు పరిష్కరించాలి



కేసుల వివరాలు పరిశీలిస్తున్న తేజచక్రవర్తి

పాతపట్నం: రాజీ పడదగ్గ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యేలా చూడాలని పాతపట్నం కోర్టు ఇన్‌చార్జి జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి అన్నారు. కోర్టు హాల్‌లో పోలీసులు, న్యాయవాదులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 11న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలు కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. పాతపట్నం సీఐ ఎం.వినోద్‌బాబు, ఎస్ఐ కామేశ్వరరావు, ఏపీపీ ప్రియదర్శిని, న్యాయవాదులు దండాసీ, సత్యనారాయణ, ఫాల్గుణరావు పాల్గొన్నారు.

లక్ష్యానికిమించి ధాన్యం కొనుగోలు చేయాలి

జలుమూరు: లక్ష్యానికిమించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని అల్లాడ పీఏసీఎస్ అధ్యక్షుడు పి.ముసలినాయుడు అన్నారు. సైరిగాం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు పెంచి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఏవో సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. అపరాల సాగులో సూక్ష్మపోషకాలు అందిస్తే దిగుబడి పెరుగుతోందన్నారు.

కొనుగోళ్లపై దృష్టి సారించాలి

ఎల్.ఎన్.పేట: ధాన్యం కొనుగోళ్లపై వీఆర్వోలు దృష్టి సారించాలని తహసీల్దారు బి.ఎస్.ఎస్.సత్యనారాయణ అన్నారు. తన కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు జరిగేలా మిల్లర్లతో మాట్లాడాలన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

ఆమదాలవలస రూరల్: కొర్లకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పొన్నాడ అప్పలనర్సమ్మ, చిన్నవాడు సేవా సంస్థ ఆధ్వర్యంలో భోజనం పేట్లు, గ్లాసులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎం.దేవరాణి మాట్లాడుతూ.. పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే దాతల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో సేవా సంస్థ వ్యవస్థాపకులు పొన్నాడ వరహానర్సింహులు, ఎంపీటీసీ సభ్యుడు అన్నెపు భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు హిరమండలంలో కొత్త పింఛన్ల పంపిణీ

హిరమండలం: మండలానికి కొత్తగా మంజూరైన 114 వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బొడ్డేపల్లి శైలజ శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేతుల మీదగా చేపట్టనున్న పంపిణీ కార్యక్రమానికి పింఛన్ మంజూరైన లబ్ధిదారులను ఆయా గ్రామ వలంటీర్లు మండల కేంద్రానికి తీసుకురావాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



సవరబెజ్జిలో సంక్షేమాన్ని తెలియజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పద్మప్రియ

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- వాండ్రాయి సచివాలయ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

సారవకోట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వాండ్రాయి సచివాలయం పరిధిలోని బెజ్జి, సవర బెజ్జి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గెల్లంకి వెంకటరావు, పోలాకి చంద్రరావు ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మూడున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సవర బెజ్జి గ్రామంలో టీడీపీ హయాంలో మంజూరైన గృహాలకు బిల్లులు మంజూరు చేయాలని పలువురు గిరిజన మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఆయన స్పందిస్తూ సమస్యను పరిష్కరించాలని గృహ నిర్మాణ శాఖ ఏఈకి సూచించారు. అలాగే పంచాయతీ నిధులు రూ. 2 లక్షలతో పారిశుద్ధ్య పనులు చేపట్టకుండా పంచాయతీ కార్యదర్శి నిధులు డ్రా చేసినట్లు బెజ్జి గ్రామానికి చెందిన పోలాకి రాము ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని పలువురు గిరిజనులు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, వైస్ ఎంపీపీలు గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య, సర్పంచ్‌లు కోరుకొండ శంకరరావు, గద్దిబోయిన గోవిందరావు, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ కొండాల దేవేంద్ర, పార్టీ నాయకులు వెలమల సింహాచలం, గొర్లె ఢిల్లీరావు, బొంగు కొండయ్య, పారశింగి లక్ష్మణరావు, కాళ్ల సింహాచలం, రావాడ శ్రీనివాసరావు, గెల్లంకి అనీల్, తహసీల్దార్ ప్రవల్లికా ప్రియ, ఎంపీడీవో విశ్వేశ్వరరావు, ఏపీవో సత్యమూర్తి, ఏపీఎం గోవిందరాజు ఉన్నారు.

నేడు కొమ్ముసరియాపల్లి పంచాయితీలో..

శనివారం వాండ్రాయి సచివాలయం పరిధిలోని కొమ్ముసరియాపల్లి పంచాయితీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విశ్వేశ్వరరావు తెలిపారు.

అధికార దాహంతో ఉన్నవారిని నమ్మకండి



మాకనాపురంలో సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- భరణికోట గ్రామ సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- ప్రజలకు ఆదివాసీ భాషలో పలకరింత

మెళియాపుట్టి: అధికారదాహంతో దుష్ప్రచారం చేసే వారిని విశ్వసించొద్దని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా, ప్రజాసేవకుడిగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. భరణికోట గ్రామ సచివాలయం పరిధిలోని కొళిగాం, సవర కొళిగాం, కోదుకొళిగాం, కాలనీ, తంగిణి, భావనాపురం, మాకనాపురం, సవరశేఖరాపురం గిరిజన గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ భాషలో గిరిజనులను ఆప్యాయంగా పలకరించగా.. వారు ఈమెకు బ్రహ్మరథం పట్టారు. ప్రతిఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. నవరత్నాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తమ గ్రామాలకు రోడ్లు కావాలని ప్రజలు కోరడంతో.. ఎమ్మెల్యే స్పందిస్తూ మంజూరై ఉన్నాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, స్థానిక సర్పంచ్‌లు సవర రాధమ్మ, సవర నీలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రవికుమార్, వైస్ ఎంపీపీ ఆదినాయుడు, పార్టీ మండల నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, పల్లి యోగి, బాలరాజు, సవర సుభాష్, అలికాన మాధవరావు, నక్క బాబూరావు, ఎంపీడీవో చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని, ఏవో దానకర్ణుడు, ఏపీఎం లలిత, ఎల్.ఎన్.పేట మండల పార్టీ నాయకుడు రెడ్డి రామారావు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

సరుబుజ్జిలి: స్వామి వివేకానందుని భావాజాలాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రొట్టవలస హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ అన్నారు. జాతీయ యువజన వారోత్సవాల్లో భాగంగా పాఠశాల ఆవరణలోని వివేకానందుని విగ్రహానికి శుక్రవారం అధ్యాపక బృందం పూలమాలలు వేసి అంజలి ఘటించారు. శారదారామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వివేకానంద సాహిత్యాన్ని ఆవిష్కరించారు. సమితి అధ్యక్షుడు మందపల్లి రామకృష్ణారావు, అధ్యాపకులు వనజాక్షి, రామకృష్ణ, సూర్యనారాయణ, రామన్న పాల్గొన్నారు.

యువతకు వివేకానంద స్ఫూర్తి

నరసన్నపేట: యువతీ యువకులకు వివేకానంద రచనలు, ఆయన ప్రసంగాలు, సూక్తులు స్ఫూర్తి కలిగిస్తాయని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర ప్రతినిధి పెంట హాటకేశం అన్నారు. సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో వివేకానంద జయంతోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఉర్లాంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న హాటకేశం మాట్లాడుతూ.. వివేకానంద జీవిత చరిత్రను వివరించారు. అలాగే చికాగో నగరంలో ఆయన ప్రసంగంతో దేశ ప్రతిష్టను పెంచారన్నారు. ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, సామాజిక సమరసత వేదిక జిల్లా ప్రతినిధి బార్ల వేణుగోపాలరావుపాల్గొన్నారు. వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ఆమదాలవలస రూరల్: వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

పాలిటెక్నిక్ కళాశాలలో..

ఆమదాలవలస రూరల్: స్వామి వివేకానంద ప్రబోధాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు అన్నారు. దన్నానపేట గ్రామం సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ యువజన వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అన్నెపు గోపి, రవీంద్రనాథ్, పి.కృష్ణ, ఎం.మోహనదాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

క్రీడా దుస్తులు పంపిణీ

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెంది.. కబడ్డీ క్రీడలో రాణిస్తున్న విద్యార్థులకు పొందూరుకు చెందిన వ్యాపారవేత్త జామి అనిల్ క్రీడా దుస్తులను, ఇతర పరికరాలను శుక్రవారం అందించారు. 14 మంది క్రీడాకారులకు ఎంఈవో పీవీ రామరాజు చేతులు మీదుగా దుస్తులను పంపిణీ చేశారు. పీడీ డి.ఉదయ్ పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి

సారవకోట: హిందూ ధర్మాన్ని పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని ఉత్తరాంధ్ర సాధూ పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామి అన్నారు. కిన్నెరవాడలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సత్సంగము కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచంలో హిందూ ధర్మం గొప్పదని.. దాన్ని ప్రతీ ఒక్కరూ రక్షించాలన్నారు. తొలుత ఆలయంలో గోపూజ చేశారు. అర్చకులు కొరపాక సిద్ధయ్య స్వామి, బోయిన వెంకటరమణ, జామి రామచంద్రరావు, పిట్ల సోమేశ్వరరావు ఉన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఈవో కూర్మారావు అన్నారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శిర్ల వేణుకుమారి అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. పింఛన్ల పంపిణీ చేసే సమయంలో సచివాలయ సిబ్బంది తమను పిలవడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు.

ఆర్‌బీకేల సందర్శన

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా అడిషనల్ డీపీఎం ధనుంజయరావు అన్నారు. కొత్తూరు, కుంటిభద్ర ఆర్‌బీకేలను శుక్రవారం సందర్శించారు. టీఐసీఆర్‌పీల పనితీరుపై సమీక్షించారు. పలు రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లోకి సిబ్బంది వెళ్లి ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం వలన కలుగు ప్రయోజనాలను వివరించాలన్నారు. కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన యాంకర్ బాబాజీ, మాస్టర్ ట్రైనీ సూర్యనారాయణ ఉన్నారు.

పట్టాల మంజూరుపై విచారణ చేయాలి

కొత్తూరు: మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్ కాలనీలో మిగులు భూములతో పాటు అదనపు పట్టాలు మంజూరుపై అధికారులు విచారణ చేయాలని నేరడి ఎంపీటీసీ సభ్యురాలు బోర కమలమ్మతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. పట్టాల మంజూరుపై డిసెంబర్ 18వ తేదీన జిల్లా స్పందనలో చేసిన ఫిర్యాదు చేశారు.